క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత మజ్జిగ పంపిణీ



వినుకొండ : విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వేసవి కాలం అంతా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పాల్గొని కార్మికులకు మజ్జిగ అందజేశారు. వీహెచ్‌పీ సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు భాగవతుల రవికుమార్, గజవల్లి నాగపవన్‌కుమార్, గాలి శ్రీనివాసరావు, భవనాసి సాంబశివరావు, భద్రయ్య, రత్నాకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

దిబ్బలను తొలగించిన పంచాయతీ సిబ్బంది

నాదెండ్ల: చిలకలూరిపేట-నరసరావుపేట రహదారిపై అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాలు, పేడదిబ్బలను పంచాయతీ అధికారులు తొలగించారు. సర్పంచ్ కామినేని లలితానాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.మధు పారిశుద్ధ్య సిబ్బందితో పనులు చేయించారు. ప్రొక్లెయినర్ సాయంతో దిబ్బలను డంపింగ్ యార్డుకు తరలించారు. ప్రతి నెలా మూడో శనివారం గ్రామాల్లో స్వచ్ఛతా పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించిన విషయం విదితమే. తాను ఆకస్మిక తనిఖీ చేసినపుడు గ్రామాల్లో చెత్త, అపరిశుభ్రంగా ఉన్నట్లయితే ఆ పంచాయతీ అధికారిపై వేటు తప్పదని ఆదేశించటంతో పంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించారు.

ప్రశాంతంగా పదో తరగతి హిందీ పరీక్ష

నాదెండ్ల, సాతులూరులో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

నాదెండ్ల: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 263 మందికి గాను ఇరువురు, చిరుమామిళ్ల జెడ్పీ హైస్కూలులో 185 మందికి గాను ఒకరు, నాదెండ్ల జెడ్పీ హైస్కూలులో 99 మందికి గాను ఇరువురు గైర్హాజరయ్యారు. నాదెండ్ల, చిరుమామిళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో హిందీ పరీక్ష జరుగుతుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు.

ఏఎన్ఎం సుమలత మృతి

వినుకొండ: పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో నివాసం ఉంటున్న ఏఎన్ఎం రాయబారం సుమలత (57) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. ప్రస్తుతం కొచ్చర్ల గవర్నమెంట్ హాస్పటల్ నందు ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి స్త్రీల సమాజం ప్రెసిడెంట్‌గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొచ్చర్ల ప్రభుత్వాసుపత్రి డాక్టర్ సిరివెన్నెల, తోటి సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.

డీఆర్ఎన్ఎస్ కళాశాలలో ఉచిత మెడికల్ క్యాంపు

చిలకలూరిపేటటౌన్: స్థానిక డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాలలో తలసేమియా డే కేర్, విష్ణు డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బైరా సుజాత ఏర్పాటైన శిబిరంలో విష్ణు డెంటల్ క్లినిక్ అధినేత డాక్టర్ బి.రాజశేఖర్, తల సేమియా సీడ్స్ అధినేత బి సాంబిరెడ్డి పాల్గొని క్యాంపుని ప్రారంభించారు. శిబిరం ద్వారా 120 మంది విద్యార్థులకు ఉచిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.ఉదయ ప్రకాష్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, హాస్పిటల్ సిబ్బంది బాబు, కోమలి పాల్గొన్నారు.


అభివృద్ధిని నాయకులు అడ్డుకుంటున్నారు

సర్పంచ్ పోపూరి జ్యోతి

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ నిధులు రూ. 25 లక్షలు ఉన్నా అభివృద్ధి పనులు చేద్దామంటే అధికార పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని గ్రామ సర్పంచ్ పోపూరి జ్యోతి తీవ్రస్థాయిలో అవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో మౌలిక వసతుల అభివృద్ధి చేయటానికి పంచాయతీ వార్డు సభ్యులు తీర్మానం చేసిన ఫలితం లేదని వాపోయారు. అధికార పార్టీ నాయకులు తరుచూ అధికారులకు పత్రికలకు ఫిర్యాదులు చేయటాన్ని సర్పంచ్ ఖండించారు. గ్రామ పంచాయతీలో మురుగుకాల్వలో పూడికతీత పనులు చేయడానికి తీర్మానం చేసి పంచాయతీ కార్యదర్శికి తెలియజేశామని, అధికార పార్టీ నాయకులు అభివృద్ధి పనులు చేయనీయకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన చెందారు. గ్రామంలో మురుగుకాల్వలు అధ్వానంగా ఉన్నాయని మురుగునీరు నిల్వ ఉండటం వలన దోమల ప్రభావంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలన్నారు.

లాభాల 'మొక్కజొన్న'

- 3500 వేల ఎకరాల్లో పంట సాగు
- 35 నుంచి 50 క్వింటాళ్ల దిగుబడులు
- మార్కెట్‌లో క్వింటా ధర రూ.2200



అరబెట్టిన మొక్కజొన్న పంట



మిషన్‌తో పంట కోయిస్తున్న రైతు

శావల్యాపురం: రబీలో అన్నదాతలు సాగు చేసిన మొక్కజొన్న పంట లాభాల పంటగా మారింది. దీంతో అన్నదాతల హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వేల్పూరు, గుంటుపాలెం, శావల్యాపురం, పోట్లూరు, కనమర్లపూడి తదితర గ్రామాల్లో రైతులు మొక్కజొన్న పంటను 3500 ఎకరాలో సాగు చేశారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు నల్లరేగడి భూముల్లో పోషకాలు అధికం చేయటం వల్ల దిగుబడులు బాగా వచ్చాయి. విత్తనం మెలకెత్తి ప్రారంభం నుంచి పంట కోసే వరకు ఒక్కో ఎకరానికి రూ. 30 నుంచి 35 వేలు వరకు పెట్టుబడులు కాగా, ఈ ఏడాది 35 నుంచి 50 క్వింటాలు దిగుబడులొచ్చాయి. యంత్రీకరణ వ్యవసాయ పరికరాలు వినియోగించటం ద్వారా సాగు సులభతరంగా మారింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర రూ. 2200 పలుకుతోంది. మొక్కజొన్న సాగు సులభతరంతో పాటు ఎరువులు వినియోగం తగ్గుతుందని, 120 రోజుల పంట కాలం అని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్న పంట సాగుకు మూడు నుంచి నాలుగు విడతలు సాగు నీరు సరిపోతుంది.

ఎకరానికి 45 క్వింటాళ్ల దిగుబడి



నేను 10 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఒక్కో ఎకరానికి 45 క్వింటాల దిగుబడులొచ్చాయి. క్వింటా ధర రూ.2250 బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నా.

– పురేటి శ్రీనివాసరావు, రైతు, గుంటుపాలెం

సంతోషంగా ఉంది



నేను 2.75 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఒక్కో ఎకరానికి రూ. 35 వేలు చొప్పున పెట్టుబడి అయ్యాయి. ఒక ఎకరానికి 40 క్వింటాల వరకు దిగుబడులొచ్చాయి. బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర రూ.2200లు ఉంది. మొక్కజొన్న పంట సాగు ఆశాజనకంగా ఉంది.

– చెరుకూరి వెంకటేశ్వర్లు, రైతు, శావల్యాపురం

ఆశాజనకంగా పంట



మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉంది. రైతుసేవా కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతూ క్వింటా ధర రూ.2320 ధర ప్రకటించారు. పంట సాగు చేసిన రైతులందరూ తమ పేర్లు నమోదు చేసుకుంటే తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తాం.

– రామినేని రామారావు, మండల వ్యవసాయ అధికారి, శావల్యాపురం

రీసర్వే పనులు వేగవంతం కావాలి

ఆర్డీవో మధులత



కొత్తలూరులో రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత

శావల్యాపురం: రీసర్వే పనులు పురోగతి వేగవంతమయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టినట్లు నరసరావుపేట ఆర్డీవో కె.మధులత అన్నారు. బుధవారం మండలంలోని కొత్తలూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించి రైతులతో మాట్లాడి రెవెన్యూ అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో కె.మధులత మాట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో 7 గ్రామాల్లో రైతుల సమక్షంలో రీసర్వే పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. కొత్తలూరు రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులు 50 శాతం పూర్తి అయినాయని సర్వే టీం సభ్యుల సంఖ్య పెంపుదల చేసి ఈనెలాఖారులోగా పూర్తి చేస్తామన్నారు. 544డి జాతీయ రహదారి నాలుగు వరుసల రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి వారం రోజుల వ్యవధిలో 3ఏ నోటిఫికేషన్ విడుదల అవుతుందని తదుపరి రెవెన్యూ, జాతీయ రహదారుల అధికారులు సంయుక్తంగా భూసేకరణ పనుల్లో భాగంగా భూములు గుర్తించి సర్వే నంబర్లు గుర్తించి సదరు రైతులతో మాట్లాడుతారన్నారు. ఈనాం భూములకు సంబంధించి అడంగల్ సమస్య ఉన్న రైతులు సమగ్ర ఆధారాలతో తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆర్ఎస్ఆర్ రికార్డు పరిశీలించి ఆర్డీవో, జిల్లా కలెక్టరు ఆమోదంతో పది రోజుల వ్యవధిలో సమస్య పరిష్కరిస్తామన్నారు. తహసీల్దారు సభావత్ సురేష్‌నాయక్,డిప్యూటి సర్వే అధికారి పేరిసోముల నాసరయ్య, ఆర్ఐ నాసరయ్య, మండల సర్వేయర్ రాజు, విఆర్వోలు ఉప్పులూరి చిన మంగయ్య, రమాదేవి రైతులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పెరిగిన హత్యలు, చోరీలు

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వినుకొండలో హత్యలు, చోరీలు, కిడ్నాప్‌లు వంటి అక్రమ కార్యక్రమాలు జరుగుతున్నాయని వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పోలీసులు ఈ ఘటనలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి సంఘటనలు ప్రజల భద్రతకు తీవ్రంగా విఘాతం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలు, బడుగు, బలహీన వర్గాల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, క్రిస్టియన్, మైనార్టీ ఆస్తులు, ఏబీఎం భూములు, సామాన్యుల భూములకు కూడా రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఖాళీగా కనిపించినా ఆక్రమించుకొని యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని విమర్శించారు. ప్రజల రక్షణకు, వారి న్యాయాన్ని సాధించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రజలకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత, పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యమన్నారు. ఈ విషయంపై పోలీస్ ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని, దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు.

విధులకు రావొద్దనడం దుర్మార్గమైన చర్య

కమిషనర్ వైఖరిని తప్పుబట్టిన సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: స్థానిక పురపాలకసంఘంలో గత ఆరేళ్లుగా పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారికి వేతనాలు సక్రమంగా చెల్లించమని అడిగినందుకు మీకు ఇచ్చేది ఈ వేతనాలే, ఇష్టమైతే రండి, కష్టమైతే మానుకోండని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు చెప్పడం దుర్మార్గమైన చర్య ని పల్నాడు జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సిలార్ మసూద్, అమరారపు సాల్మన్ అన్నారు. బుధవారం కార్మికులతో కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి తమకు పూర్తి జీతం రూ.21వేలు చెల్లించాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందన అనంతరం కార్యాలయ ఆవరణలో నాయకులు మాట్లాడారు. కరోనా సమయాల్లో సైతం విధులు నిర్వహించిన సుమారు 30 మంది కార్మికులకు ఆప్కాస్‌లో గత ఐదేళ్లుగా తమ పేర్లు నమోదై ఉన్నా మీరు బదిలీ కార్మికులు అనే పేరుతో మున్సిపల్ అధికారులు నెల మొత్తం పని చేయించుకుని ఒక్కొక్కరికీ పది రోజులు 12, 14, 16 రోజులు వేతనాలే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి కార్మికులందరికీ రూ.21వేల వేతనం ఇవ్వకుంటే కార్మిక వర్గం మొత్తాన్ని ఐక్యం చేసి సమ్మె చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నామని హెచ్చరిక చేశారు. యూనియన్ నాయకులు సాల్మన్, జీవరత్నం, వీరకుమార్, నరసింహారావు, కృపారావు, సమాధానం పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలో చిరస్థాయిగా సునీత విలియమ్స్

నరసరావుపేట రూరల్: అంతరిక్ష వ్యోమగామి సునీత విలియమ్స్ విజయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఆర్‌కేటీ కాలనీ మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురులింగం తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్ర నుంచి భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ విజయవంతంగా భూమికి చేరడాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గురులింగం మాట్లాడుతూ ఎనిమిది రోజుల పర్యటన కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సునీత విలియమ్స్ తొమ్మిది నెలల సుదీర్ఘకాలం అక్కడే గడిపి బుధవారం భూమికి చేరుకుందని తెలిపారు. సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు 300 రోజులకు పైగా అంతరిక్షంలో గడపడం ఒక రికార్డుగా పేర్కొన్నారు. సునీత విలియమ్స్ అంతరిక్ష పరిశోదనలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుబ్బారావు, అపర్ణ, ఫాతిమా రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ఆరంభం

చిలకలూరిపేటటౌన్: మండల పరిధిలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించటం ఏవో టి శ్రీలత తెలిపారు. రబీ 2024-25 సంవత్సరంలో శనగ పంట వేసిన రైతులను ఈ-పంట ద్వారా నమోదు చేయటం జరిగింది. కొనుగోలు కేంద్రాల ద్వారా శనగ అమ్ముకోదలచిన రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకు తెలియచేశారు. శనగ మద్దతు ధర రూ.5,650తో మార్కెఫెడ్ ఆధ్వర్యంలో జీడీసీఎంఎస్ ద్వారా కొనుగోలు జరుగుతుందని తెలిపారు.

ఘనంగా శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాళ్ల

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం శివారు మర్రిచెట్టుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ 44వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు చేసి స్వామి వారికి నైవేద్యం, మొక్కు బడులు చెల్లించుకున్నారు. తెల్లవారు జాము నుండే రైతులు తమ పశు సంపదను ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేయించారు తిరునాళ్లలో శాంతి భద్రతలను రొంపిచర్ల పోలీసులు పర్యవేక్షించారు.

కరెంట్ బిల్లుల్లో లోపాలపై ఫిర్యాదు చేయండి

నరసరావుపేటటౌన్: విద్యుత్ హెచ్చు తగ్గులు, కరెంట్ బిల్లుల్లో లోపాలు, ఇతర విద్యుత్ సమస్యలపై విద్యుత్ అదాలత్‌లో ఫిర్యాదు చేయాలని విద్యుత్ శాఖ ఈఈ సి.హెచ్ రాంబొట్లు బుధవారం తెలిపారు. గురువారం పాతూరులోని విద్యుత్ కార్యాలయం పక్కన గల శ్రీరస్తు కళ్యాణ మండపంలో నిర్వహించే విద్యుత్ అదాలత్‌కు సీజీ ఆర్ఎఫ్ చైర్మన్ ఎస్. విక్టర్ ఇమ్మానియేల్, సాంకేతిక సభ్యులు కె. వెంకట కృష్ణ, ఆర్ సిహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు ఏ. సునీత తదితరులు హాజరవుతారన్నారు.

నేడే మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎండీఓ కె. మ్యాథ్యూ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై, ఇతర అంశాలపై ఎంపీపీ అధ్యక్షతన సమీక్షించడం జరుగుతుందని అన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించండి

నరసరావుపేట: సత్తెనపల్లిరోడ్ ఏనుగుల బజార్‌లోని ఆవుల సత్రం పక్కన ఉన్న కత్తవ మురుగుకాలువను ఆక్రమించి అందులో భీములు వేసి కాలువ మొత్తాన్ని కబళించాలని కొందరు ఆక్రమణదారులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మున్సిపల్ అధికారులను కోరారు. అందులో కట్టుబడి చేసి రేకులు వేయడానికి ఆక్రమణదారులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. బుధవారం ప్రజాసంఘాల నాయకులు ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. తక్షణమే మున్సిపాలిటీ అధికారులు ఆక్రమణలు తొలగించి నీటి ప్రవాహనికి ఆటంకం లేకుండా చూడాలని కోరారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలి

నరసరావుపేటటౌన్: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహం నందు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలు తెలుసుకోవటం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. గృహహింస, బాలికల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాల గురించి వివరించారు.

క్రమశిక్షణే ఉన్నతికి తొలిమెట్టు

నరసరావుపేట ఈస్ట్: క్రమశిక్షణతో సమయపాలన పాటించే విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారని వాగ్దేవి డిగ్రీ కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో బుధవారం డిగ్రీ ఫైనలియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో అలవడిన క్రమశిక్షణను ఉపాధి, ఉద్యోగాలలో కొనసాగించాలని హితవు పలికారు. ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాదు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, ఇస్కెపల్లి కృష్ణకిషోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

నరసరావుపేట: పట్టణ ప్రజలు పురపాలకసంఘానికి చెల్లించాల్సిన పన్నులు మార్చి 31లోగా చెల్లించి పురపాలక అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. వందశాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా బుధవారం సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని కోరుతూ మున్సిపల్ అతిథి గృహంలో వారితో సమావేశం నిర్వహించారు. ఇంజనీరు బి.కనకారావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన గృహ లబ్ధిదారులకు అదనపు సహాయం

బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు మేలు

నూజెండ్ల: ప్రధానమంత్రి అవాస్ యోజన పథకాన్ని గృహ నిర్మాణ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ యల్లమంద బుధవారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో ఒక్కో లబ్ధిదారుడు ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75, ఆదివాసులకు రూ.లక్ష రూపాయలు నూతన గృహాల నిర్మాణ దశలు ఆధారంగా నాలుగు విడతల్లో నగదు అదనంగా అందజేస్తామన్నారు. ఇంటి నిర్మాణం కోసం ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకున్న బీసీ, ఎస్టీ, ఎస్సీ వర్గానికి చెందిన వారందరు మరలా సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులను సంప్రదించి ఆన్‌లైన్ నమోదు చేసుకుంటే సెల్ ఫోనుకు వచ్చే ఓటీపీ ఆధారంగా అదనపు సహాయానికి అర్హత పొందుతారన్నారు.

ఆరోగ్య కేంద్రానికి నగదు వితరణ

చిలకలూరిపేటటౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట కమ్యూనిటీ హాలులో గల రోటరీ ఉచిత ఆరోగ్య కేంద్రమునకు రోటరీ మాజీ అధ్యక్షులు రొటేరియన్ కారుమంచి శివరావు రూ.12 వేల విలువైన మందుల కొనుగోలు నిమిత్తం విరాళంగా ఇచ్చారు. వారికి క్లబ్ సభ్యులు అందరి తరపున క్లబ్ అధ్యక్షులు ఆళ్ల వేమనరెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కందుల రంగారావు, క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, మాజీ అధ్యక్షులు తొట్టెంపూడి వెంకటేశ్వరరావు సభ్యులు పాల్గొన్నారు.

రేపు వినుకొండలో జాబ్‌మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21వతేదిన వినుకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు బుధవారం తెలిపారు. పదవ తరగతి నుంచి పీజీ వరకు, బిటెక్, ఫార్మసీ, డిప్లొమో చదివిన నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. వివరాలకు డి.జానీబాషా 9951214919, ఎన్.శ్రీలక్ష్మి 7288059665 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని ఇసప్పాలెం మహంకాళీ అమ్మవారి తిరునాళ్లకు పట్టణంలోని పలు ప్రదేశాల్లో భక్తులు నిర్మించిన ప్రభలు తరలివెళ్లే కార్యక్రమంలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఆటో యూనియన్ వర్కర్లు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొని ముస్లిం సోదరులకు ఫలహారాన్ని పంపిణీ చేశారు. ఆయన వెంట పలువురు పాల్గొన్నారు.

వైభవంగా ఏకోనారాయణస్వామి తిరునాళ్ల



బొల్లాపల్లి : మండల కేంద్రమైన బొల్లాపల్లిలో శ్రీ వెంకట ఏకోనారాయణస్వామి తిరునాళ్ల అంగరంగవైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. పశువులు వృద్ధి చెందాలని రైతులు తమ పశువులను ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు కొందరు తమ వంతు సేవా కార్యక్రమాల్లో భాగంగా భక్తులకు పులిహోర, మజ్జిగ, మంచినీరు అందజేశారు. గ్రామంలో భక్తుల ఉల్లాసం కొరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 4 భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ ఆధ్వర్యంలో తిరునాళ్లను పురస్కరించుకొని అల్లర్లకు తావు లేకుండా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు.

యడ్లపాడులో చోరీకి విఫలయత్నం



సీసీ పుటేజ్‌లో చిక్కిన దుండగుడు

యడ్లపాడు: స్థానిక స్టేజీ సెంటర్ సమీపంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. స్థానికుల సమాచారం మేరకు...గ్రామానికి చెందిన పోపూరి సాంబయ్యకు ఇద్దరు సంతానం వారు ఎన్ఆర్ఐలు కావడంతో సాంబయ్య కొంత కాలం స్వగ్రామంలోనూ, హైదరాబాద్‌లోనూ మరికొంతకాలం నివాసం ఉంటుంటాడు. దీనినే అదునుగా చేసుకున్న గుర్తు తెలియని దుండగులు సాంబయ్య హైదరాబాద్ వెళ్లిన విషయం గమనించి బుధవారం రాత్రి స్థానికంగా ఉన్న ఆయన ఇంటిలో చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. సదరు ఇంట్లో సీసీ కెమెరాలు ఉండటంతో దుండగుల కదలికలు రికార్డు అయ్యాయి. ముందుగా ప్రధాన గేటు గడియను పగలగొట్టేందుకు ప్రయత్నించగా దానికి సెంట్రల్ లాక్ ఉండి ఓపెన్ కాలేదు. ఇంటి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలను పక్కకు తిప్పి, ఎలాంటి ఆధారాలు మిగలకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయినప్పటికీ, ఇంటి చుట్టుపక్కల మరికొన్ని సీసీ కెమెరాలు ఉండటంతో వారి కదలికలు రికార్డు అయినట్లు తెలుస్తోంది. ఇదివరకు ఇదే ఇంటిలో మూడుసార్లు చోరీలు జరిగాయని, తొలి ఘటనలో భారీ నష్టం జరిగినప్పటికీ ఆ తర్వాత మాత్రం చిన్నస్థాయి దొంగతనాలు జరిగినట్లు బాధితుడు తెలిపారు. ఈ సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, సీసీ పుటేజ్‌ల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. గ్రామస్తులు అలర్ట్‌గా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ వి.బాలకృష్ణ సూచించారు.

రైతుల ఆర్థిక ప్రగతికి వెదురు పెంపకం దోహదం

ఉద్యాన సంచాలకులు దేవమునిరెడ్డి



మాట్లాడుతున్న దేవమునిరెడ్డి

నూజెండ్ల: రైతులు ఆర్థిక ప్రగతి సాధించడానికి వెదురు పెంపకం ఎంతో దోహదపడుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త ఉద్యాన సంచాలకులు దేవమునిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రవ్వావరం గ్రామంలో వెదురు పంట సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో పెరగనున్న వెదురు ఉత్పాదకల దృష్ట్యా రైతుల వెదురు సాగు చేయటం అర్థిక అభివృద్ధి సాధిస్తారన్నారు. పంట జీవితకాలం 5 నుంచి 50 సంవత్సరాల వరకు దిగుబడులు పొందవచ్చునన్నారు. మన ప్రాంతానికి వెదురు రకాలైన తుల్డా, బాల్కోవా, బ్యాంబుస్సు, వంటి రకాల అనువైవన్నారు. ఎకరాకు 160 మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ప్రభుత్వం 25 ఎకరాల వరకు రాయితీ అందజేస్తుందన్నారు. ఎకరానికి రూ.24 వేల చొప్పున రెండు సంవత్సరాలు కాలపరిమితిలో పొందవచ్చునన్నారు. ఆసక్తి కల్గియున్న రైతుల స్థానిక రైతుసేవా కేంద్రాల్లో పట్టాదారు పాస్‌పుస్తకాలు అడంగల్, బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ పాటు నర్సరీ బిల్లు అందించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వినుకొండ ఉద్యానశాఖాధికారి షేక్ నబీ రసూల్, ఏవో సుగుణా బేగం,ఉద్యాన అధికారులు మోహన్, నవీన్‌కుమార్, విశాల్, సురేష్‌కుమార్, శ్రీనిత్య, ఆదర్శ రైతు వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేటటౌన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. పురపాలక సంఘంలోని తన కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రజలు వివిధ సమస్యలపై అందించిన వినతులను ఆయన స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు, పట్టణ జనాభాకు తగ్గట్టుగా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇటీవల మరమ్మతుల కారణంగా మంచిటి సరఫరాలో కొన్ని ప్రాంతాల్లో అసౌకర్యం కలిగిన విషయాన్ని పురప్రజలు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వేకువజామున నమాజ్‌కు వెళ్లే వారికి ఇబ్బందులు లేకుండా వీధి లైట్ల ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు పట్టణంలోని అన్ని వార్డుల్లోని వీధిలైట్లు, బోర్ల మరమ్మతులకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. అవసరమైన చోట విద్యుత్ పోల్స్ ఏర్పాటుపై సంబంధిత డీఈతో మాట్లాడటం జరిగిందన్నారు.